పత్తాలేని ప్రత్యేకాధికారులు

సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. వివిధ శాఖలకు చెందిన వారిని స్పెషల్ ఆఫీసర్లుగా ప్రభుత్వం నియమించింది. వారిలో కొందరికి గ్రామపాలనపై అవగాహన లేక పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గ్రామపాలన, నిధుల విషయంలో స్పష్టత లేకపోవడంతో గ్రామపాలన పడకేసింది. దీంతో గ్రామ పంచాయతీల్లో నిధులు ఖాళీ అయ్యాయి. కనీసం తాగునీటి బోరు మోటార్ల మరమ్మతులు, మురుగుకాల్వల పరిశుభ్రతకు నోచుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.


రుక్మాపూర్‌లో రెండు నెలల క్రితం పాడైన బోరు


రుక్మాపూర్‌లో ఓవర్ హెడ్‌ట్యాంకు

- జీపీలో నిధుల కొరత!
- సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు
- ఎమ్మెల్యే ఆదేశించినా జరగని పనులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

పెద్దేముల్: గ్రామ పంచాయతీల్లో నిధులు లేక కొట్టు మిట్టాడుతున్నాయి. గ్రామాల్లో బోరు మోటార్లు పాడైన పట్టించుకునే వారే లేరు. ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించిన ఎలాంటి లాభం లేదనే ఆరోపణలు వినబడుతున్నాయి. మండల అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదంటున్నారు. పెద్దేముల్ మండల రుక్మాపూర్ గ్రామంలో సుమారు 1200 మందికి పైగా జనాభా, ఎనిమిది వార్డులు, రెండు మంచినీటి ట్యాంకులున్నాయి. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధికారి పాలన ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కానీ, ఇంతకు వారు ఎవరు ఎక్కడా, ఎప్పుడు ఉంటారో తెలియని పరిస్థితి ఉందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీరు అందక, మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్నా పట్టించుకోక రోగాలు బారిన పడుతున్నామని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. రుక్మాపూర్ గ్రామంలో తాగునీరు అవసరాలు తీర్చే బోరు సుమారు రెండు నెలల క్రితం పాడైన ఇంత వరకు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో పూర్తిస్థాయిల్లో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతున్నా చాలడం లేదని గ్రామ ప్రజలు చెబుతున్నారు. మండల అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, వచ్చిన చుట్టపు చూపుగా వచ్చి పోవడం తప్ప సమస్యలు తీర్చడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది ప్రత్యేకాధికారులు నెలకు ఓసారి కూడా గ్రామాలకు వెళ్లటం లేదని సమాచారం. గ్రామాల్లో సమస్యలు ప్రస్తావనకు రాగానే జీపీల్లో నిధులు లేవని చేతులు ఎత్తేయడం తప్పా పరిష్కారం చేయడం లేదు. బోరు పాడై నిధులు లేక మరమ్మతుకు నోచుకోవడం లేదు. అలాగే, రెండు రోజుల క్రితం మంబాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ నీరు నిలిచిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడ్డారు. రుక్మాపూర్ గ్రామంలో తాగునీటి విషయమై గ్రామ ప్రజలు స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే కొత్త బోరు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించినా పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేకాధికారులు వారంలో మూడు రోజులైన గ్రామాలకు వచ్చేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ చట్టాలు, సైబర్ మోసాలపై అవగాహనను పెంపొందించుకోవాలని కుల్కచర్ల ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కుస్మసముద్రం గ్రామంలో శనివారం రాత్రి నిర్వహించిన పోలీసుల కళాజాతలో పోలీసు చట్టాలు, సైబర్ మోసాలు, మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న చిన్న అంశాలకు గొడవలు పెట్టుకోవడం, ఎప్పుడో జరిగిన ఘటనలను మనసులో పెట్టుకుని కక్షసాధింపు చర్యలకు పాల్పడటం మంచికాదన్నారు. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోకుండా ప్రతీ చిన్న విషయాన్ని ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయాలను తీసుకోవాలన్నారు. ఎదైనా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తితే వెంటనే 100నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాజాత సిబ్బంది, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

మా గ్రామానికి బస్సు ట్రిప్పులు పెంచండి

కొడంగల్: మండల పరిధిలో పెద్ద గ్రామ పంచాయతీ రుద్రారం. ఐదువేలకు పైగా జనాభా ఉంటారు. కొడంగల్ నియోజకవర్గానికి 22 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం పాఠశాల సమయానికి విద్యార్థుల కోసం ఉదయం ఒక ట్రిప్పు, సాయంత్రం మరో ట్రిప్పు నడిపిస్తున్నారు. కనీసం మధ్యాహ్నం వేళ ఒకసారి బస్సును వేస్తే రాకపోకలకు అనుకూలంగా ఉంటుందని గ్రామస్తులు కోరుతున్నారు. కొడంగల్ నుంచి రుద్రారం వెళ్లే మార్గంలో చిట్లపల్లి, సంగాయిపల్లి, అంగడిరాయిచూర్, లక్ష్మీపల్లి, టేకుల్ కోడ్, అన్నారం, నాగారం గ్రామాలు ఉన్నాయి. బస్సును నడిపించడం వల్ల ధర్మాపూర్, పాటిమీది పల్లి గ్రామాల ప్రజలకు కూడా మేలు జరుగుతుంది. ప్రజలు తాండూరు, పరిగి డిపో మేనేజర్లకు ఫిర్యాదు చేసినా వారిలో చలనం లేదని వాపోయారు. పెద్ద గ్రామమైన రుద్రారానికి బస్సు ట్రిప్పులను పెంచి రవాణా వ్యవస్థను పటిష్టం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వీరజవాన్ల త్యాగం మరువలేనిది


వీరజవాన్లకు నివాళులర్పిస్తున్న నాయకులు

పరిగి: దేశ సేవలో వీరజవాన్ల ప్రాణత్యాగాలు ఎన్నటికి మరవలేనివని ఎక్స్ సర్వీస్ మెన్ సెంట్రల్ ఆర్మీ పోలీస్ ఫోర్స్ జిల్లా అధ్యక్షుడు లింగయ్య అన్నారు. ఈ నెల 6వ తేదీ, 8వ తేదీలో జమ్మూ కాశ్మీర్‌లోని బిలావత్ వద్ద ఉగ్రవాదులతో పోరాడి దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లకు ఆదివారం పరిగి వాకింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో తిరుమల వెంచర్‌లో నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదులతో పోరాడి 8 మంది జవాన్లు వీర మరణం పొందారన్నారు. దేశ రక్షణే ధ్యేయంగా జవాన్లు పోరాటం చేస్తారన్నారు. ప్రతి ఒక్కరు తన జీవితంలో దేశం కోసం ఏదో ఒకటి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పోచయ్య, గోపాల్, వెంకట్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీత్లా పండుగ


బోనానికి ప్రత్యేక పూజలు చేసిన గిరిజనులు

దుద్యాల్: ఆశాఢమాసంలో ఆయా గ్రామాల్లోని ప్రజలు గ్రామ దేవతలకు బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తారు. కానీ, గిరిజన తండాల్లో ఇదే తరహాలో సీత్లా పండగను జరుపుకొంటారు. అందులో భాగంగా ఆదివారం మండలంలోని అన్ని గిరిజన తండాల్లో సీత్లా పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. గిరిజనుల గ్రామ దేవతగా పేరుపొందిన మారెమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని చెట్టుపల్లి తండా, సంగాయపల్లి తండా, రోటిబండ తండా తదితర తండాల్లో గిరిజనులు ఇంటి ముందు చిన్న భోనం ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి మేక మాంసాన్ని నైవేద్యంగా సమర్పించారు.

గోవర్ధన్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ



సంతాపసభలో పాల్గొన్న మాజీ ఎంపీపీ, తదితరులు

కొడంగల్: నియోజకవర్గంలోని కోస్గి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దివంగత గోవర్ధన్‌రెడ్డి కుటుంబాన్ని కొడంగల్ మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ ఆదివారం పరామర్శించారు. పోతిరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన గోవర్ధన్‌రెడ్డి సంతాప సభకు ఆయన హాజరై నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి, పీసీసీ సభ్యుడు విజయ్‌కుమార్, బల్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశం మొత్తం బీజేపీ వైపు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాద్‌రావు


బీజేపీలో చేరుతున్న సీపీఐ నాయకులు

పరిగి: బీజేపీ దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత దేశం మొత్తం బీజేపీ వైపు చూస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్ రావు అన్నారు. సీపీఐ(ఎం) నాయకులు బసిరెడ్డి, శ్రీశైలం, మల్లేష్, బాల్‌రాజ్, జంగయ్య, వెంకటేశ్‌లు ఆదివారం పట్టణ కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు అందిస్తున్న సంక్షేమాలకు ఆకర్షితులై ఎంతో మంది పార్టీలో చేరుతున్నారన్నారు. ప్రపంచ దేశాలు భాతరదేశం వైపు చూస్తున్నారంటే అది కేవలం నరేంద్ర మోదీకే సాధ్యమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో పరిగిలో బీజేపీ జెండాను ఎగరవేస్తామన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ నరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్యగౌడ్, కేశవులు, మహిపాల్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భీమయ్య పాల్గొన్నారు.

టీజీఎస్‌పీడీసీఎల్ యాప్‌తో కరెంట్ బిల్లులు కట్టాలి

వికారాబాద్ ఏఈ

అనంతగిరి: ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులను చెల్లించే వినియోగదారులు ఇకపై టీజీఎస్‌పీడీసీఎల్ యాప్‌లో కాని, టీజీఎస్‌పీడీసీఎల్ వెబ్ సైట్‌లో కాని చెల్లించాలని వికారాబాద్ ట్రాన్స్‌కో ఏఈ పూర్ణచందర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1 నుంచి ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, అమెజాన్‌పే లాంటి థర్డ్‌పార్టీ యాప్‌లో విద్యుత్ బిల్లుల చెల్లింపులను నిలివేయడం జరిగిందన్నారు. వినియోగదారులు టీజీఎస్‌పీడీసీఎల్ యాప్ ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని అందులో యూఎస్‌సీ నంబర్ (కరెంట్ బిల్‌లో యూఎస్‌సీ నంబర్ అని ఉంటుంది)ను , మొబైల్ నంబర్‌ను ఎంట్రీ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అనంతరం పే బిల్ అనే ఆప్షన్ పై క్లిక్ చేసి పేమెంట్‌ను కంప్లీట్ చేయాలన్నారు.

ప్రజావాణితో ప్రయోజనం

ఎంపీడీఓ రాములు

బంట్వారం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాములు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే ప్రజావాణిలో ఫిర్యాదు చేయొచ్చన్నారు. మండల ప్రజలు కలెక్టరేట్‌కు వెళ్లకుండా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలోనే ఫిర్యాదు చేయాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ఊరంతా కలిసి.. వీడ్కోలు పలికి..


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

తాండూరు రూరల్: మండలంలో గుంతబాసుపల్లి చిన్న గ్రామం. గత 9 సంవత్సరాలుగా గ్రామ పాఠశాల్లో తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఊరంతా కలిసి సన్మానం చేశారు. ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తుంటే గ్రామస్తులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. గుంతబాసుపల్లిలోని ప్రాథమిక పాఠశాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు బాలకృష్ణ, అనిల్ బదిలీపై యాలాల, గోనూర్ గ్రామాలకు బదిలీపై వెళ్లారు. ఊరంతా కలిసి ఉపాధ్యాయులను ఆదివారం శాలువ, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు జగదీష్, మాజీ ఉప సర్పంచు ఖైరత్ అలీ గ్రామస్తులు అస్గర్ పటేల్, దస్తయ్యగౌడ్, గౌస్ పటేల్, తుల్జారాం, మహబూబ్ అలీ,తుల్జప్ప,యాదప్పలు పాల్గొన్నారు.

గౌడల అభ్యున్నతికి మరిన్ని పథకాలు

- గౌడ సంఘం మండలఅధ్యక్షుడు కృష్ణయ్య గౌడ్



కుల్కచర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం గౌడ కులస్తుల అభ్యున్నతికి మరిన్ని పథకాలు అమలు చేయాలని మండల గౌడ సంఘం అధ్యక్షుడు మాలి కృష్ణయ్య గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి గౌడ కులస్తులకు మోకులు ఇస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. తాటి చెట్లు ఎక్కే గౌడ సోదరులు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.10 లక్షలు, గాయపడితే రూ. 5 లక్షల బీమా కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో గౌడ సోదరులకు మోటార్ బైక్, సంఘాలకు ఐదు ఎకరాల భూమిలో ఈత, తాటి చెట్లను పెంచి ఇవ్వాలన్నారు. అలాగే, రూ. 5 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. ప్రతి గ్రామంలో కల్లు దుకాణాలు ఉన్నాయని, బెల్ట్ దుకాణాల వల్ల కల్లు దుకాణాలు సక్రమంగా నడవడం లేదని వాపోయారు. వెంటనే ప్రభుత్వం బెల్ట్ దుకాణాలను బంద్ చేయించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


దుద్యాల్: ఆత్మీయ సమ్మేళనంలో..


పరిగి: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 24సంవత్సరాల క్రితం 10వ తరగతి పరీక్షలు రాసి కొందరు పైచదువుల కోసం వేర్వేరు పట్టణాలకు వెళ్లారు. మరి కొందరు ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగం చేస్తున్నారు. మరికొందరు వ్యాపార రంగాల్లో స్థిరపడ్డారు. కొంతమంది వ్యవసాయ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. చాలా సంవత్సరాల అందరు స్నేహితులం కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

పరిగిలో..

పరిగి: మండలంలోని పెద్దమాదారం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04వ సంవత్సరం పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరవేసుకొని ఆనందంగా గడిపారు. తోటి స్నేహితులు యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువును సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా రక్తమైసమ్మకు బోనాలు


తాండూరు రూరల్: ప్రదక్షిణ చేస్తున్న మహిళలు


ధారూరు: బోనాలతో ఊరేగింపుగా మహిళలు

తాండూరు రూరల్: మండలంలోని అంతారం గ్రామంలో రక్త మైసమ్మ బోనాల జాతర ఆదివారం నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, డోలువాయిద్యాలు, నృత్యాల మధ్య బోనాలు ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని గ్రామస్తులు అమ్మవారికి మొక్కుకున్నారు. కార్యక్రమంలో వడ్డె శ్రీను ,శేఖర్ ,శాంతు ,వెంకట్‌రెడ్డి, లాలయ్య, చంద్రయ్య, ప్రభాకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, బాలప్ప, ఆశన్న, పాల్గొన్నారు.

నాగసమందర్‌లో మైసమ్మ తల్లికి బోనాలు

ధారూరు: మండలంలోని నాగసమందర్‌లో ఆదివారం గ్రామదేవత మైసమ్మ తల్లికి బోనాల జాతరను నిర్వహించారు. మహిళలు పట్టువస్త్రాలు ధరించి మట్టి కుండలకు కుంకుమ, పసుపు తిలకం దిద్ది, మట్టి ప్రమిదలో దీపం వెలిగించి నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా బయలుదేరారు. ఊరేగింపులో శివసత్తుల పూనకాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. మైసమ్మగుడి వద్దకు బోనాలతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కుకున్నారు.

సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వాలి


శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన మండల నాయకులు

యాలాల: కాంగ్రెస్ పార్టీ పదవుల కేటాయింపులో సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వాలని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోదరుడు, సీనియర్ నాయకుడు ఆర్‌బీఎల్ శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్న నర్సిరెడ్డికి ఇటీవల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవి కేటాయించడంతో అధ్యక్ష స్థానాన్ని మరోకరికి కేటాయించాలన్నారు. పార్టీ మండల అధ్యక్ష బాధ్యతను జక్కేపల్లి గ్రామానికి చెందిన కొర్వని అమృతప్పకు కేటాయించాలని పలువురు నాయకులు శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై ఇప్పటికే ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు రఘురాంరెడ్డి, ఆరిఫ్ హుస్సేన్, సత్యనారాయణరెడ్డి, ప్రశాంత్, అనంతయ్య, రాంచందర్ తదితరులు ఉన్నారు.

కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధితో బాలిక మృతి

బొంపల్లి గ్రామంలో విషాదం


సంకీర్తన (ఫైల్)

దోమ : కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధితో ఓ బాలిక మృతి చెందిన ఘటన.. మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అప్పగాళ్ల ప్రవీణ్, లక్ష్మికి ఇద్దరు సంతానం. వారి పెద్ద కుమార్తె సంకీర్తన(11) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. అయితే బాలిక నిరసంగా ఉండటంతో గమనించిన తల్లిదండ్రులు, గత 15 రోజుల క్రితం బాలికను పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. వారు మెరుగైన వైద్యం అందించాలని సూచించడంతో, వికారాబాద్‌లోని మహవీర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ బాలికకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. కిడ్నీ, ఊపిరితిత్తులు పాడై పోయాయని తెలిపారు. ఉన్నత వైద్యం చేయించాలని తెలిపారు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్లు బతికే చాన్స్ తక్కువ ఉందని చెప్పారు. చేసేది ఏమీలేక బాలికను నాలుగురోజుల క్రితం ఇంటికి తీసుకువచ్చారు. ఆదివారం పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. బాలిక మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

క్లుప్తంగా

18న మంత్రి కోమటిరెడ్డి రాక

బషీరాబాద్: ఈ నెల 18న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బషీరాబాద్ రానున్నట్లు తాండూరు ఎమ్మెల్యే బియ్యాని మనోహర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకారం కార్యక్రమంతో పాటు మండలంలో పలు రోడ్లకు, భవనాలకు శంకుస్థాపనలు చేస్తారని చెప్పారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

వైద్య శిబిరం విజయవంతం

తాండూరు రూరల్: మండల పరిధిలోని చెంగోల్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం అయింది. పట్టణంలోని మహాలక్ష్మి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య నిపుణురాలు స్పందనరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 126 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ప్రతి నెల గ్రామంలో పేద ప్రజల కోసం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ జెడ్పీటీసీ గొడి మంజుల ,మాజీ ఎంపీటీసీ గొడి వెంకటేశంలు తెలిపారు.

హనుమాన్ ఆలయంలో పారాయణం

కొడంగల్: కొడంగల్ – హైదరాబాద్ జాతీయ రహదారిపై బొంరాస్‌పేట గేటు సమీపంలో ఉన్న హనుమాన్ ఆలయంలో ఆదివారం ఉదయం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. హిందూవాహిని ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి రాకేశ్‌కుమార్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గంటి సర్వేష్ తదితరులు ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థి

కుల్కచర్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్నేహితుడికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 2002–2003 పదవ తరగతి పూర్తి చేసిన లోకారం గత నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న స్నేహితులు ఆదివారం ముజాహిద్ గ్రామానికి వచ్చి స్నేహితుడిని పరామర్శించి రూ. 12 వేల ఆర్థిక సహాయం అందజేశారు. స్నేహితులకు ఎలాంటి కష్టాలు వచ్చిన తాము అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తుకారం, ఆనందం, రవి, నరేశ్, మాగయ్య, గోపాల్, నెహ్రూ, హరిశ్చందర్, రాములు, రవీందర్ పాల్గొన్నారు.

గురునాథ్‌రెడ్డికి సన్మానం


శుభాకాంక్షలు చెబుతున్న ఎన్‌ఆర్‌ఐ

కొడంగల్: రాష్ట్ర పోలీస్ హౌసింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని పట్టణానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ హరిప్రసాద్ వశిష్ట ఆదివారం సన్మానించారు. గురునాథ్‌రెడ్డి నివాసానికి వెళ్లి శాలువా పూలదండతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ట, డాక్టర్ సాకేత్, మిఠాయి రాజు, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బోర్లను బాగు చేయించండి


పాడైన బోరు

ధారూరు: మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్, ఎస్సీ కాలనీలోని బోర్లు పాడై 8 నెలల కావస్తున్నా బాగు చేయడం లేదని ప్రజలు ఆరోపించారు. పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రతి శనివారం జరిగే సంతకు వచ్చే వ్యాపారులు, రైతులు, మహిళలకు తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ తాగునీరు రోజు సక్రమంగా రాకపోవడంతో సంతకు వచ్చే వారంతా బోర్లపైనే ఆధారపడతారని అన్నారు. తాగునీటి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. కూరగాయల మార్కెట్లో ఉన్న బోరుకు మోటారుతో పాటు చేతిపంపు ఉన్నా సరిపెట్టుకునేవారమని, చేతి పంపును తొలగించి బోరుపైన బండరాయి పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. మరమ్మతులకు గురైన బోర్లను వెంటనే బాగుచేయించి తాగునీటి ఇక్కట్లు తీర్చాలని కోరారు.